## మొదటి పాఠం
## الدرس الأول

## ఉపవాస ఆదేశం
## حكم الصيام

ఇస్లాం ఐదు మూల స్తంభాలలో రమజాను ఉపవాసాలు ఒకటి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆదేశానుసారం: **ఇస్లాం పునాది ఐదు మూలస్తంభాలపై ఉంది: ① సత్య ఆరాధ్యనీయుడు అల్లాహ్ తప్ప మరెవ్వడూ లేడు, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క ప్రవక్త అని సాక్ష్యమిచ్చుట. ② నమాజు స్థాపించుట. ③ జకాత్ (విధిదానం) చెల్లించుట. ④ హజ్ చేయుట. ⑤ రమజాన్ ఉపవాసాలు పాటించుట.** (బుఖారి 8, ముస్లిం 16).

### ఉపవాసమంటేమిటి ?

ఉపవాసం అంటే: అల్లాహ్ ప్రసన్నత కొరకు, అల్లాహ్ ఆరాధన ఉద్దేశ్యంతో ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలు, సంభోగము మరియు ఉపవాసమును భంగపరుచు కార్యాలన్నిటినీ విడనాడుట. (దీనినే అరబిలో సౌం, ఉర్దులో రోజా అంటారు).

రమజానుపవాసాలు విధిగా ఉన్నాయని క్రింది ఆయతు ఆధారంగా ఏకాభిప్రాయం ఉంది: **మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి.** (అల్ బఖర 2: 185).

### ఉపవాసం ఎవరిపై విధిగా ఉంది ?

ప్రతీ తెలివిగల, యుక్తవయస్సుకు చేరిన ముస్లిం స్త్రీ పురుషునిపై ఉపవాసం విధిగా ఉంది. 15 సంవత్సరాలు నిండుట లేదా నాభి క్రింద వెంట్రుకలు మొలుచుట, స్వప్నస్ఖలనమగుట మరియు బాలికలకు పై మూడితో పాటు నెలవారి రక్తస్రావమగుట. వీటిలో ఏ ఒక్కటి సంభవించినా యుక్త వయస్సుకు చేరినట్లే.

### రమజాన్ & ఉపవాసాల ఘనత

అల్లాహ్ రమజాను మాసమునకు అనేక ఘనతలు ప్రత్యేకించాడు. ఇతర మాసాల్లో ఆ ఘనతలు లేవు. వాటిలో కొన్ని ఇవిః

1- దైవదూతలు ఉపవాసమున్నవారి గురించి ఇఫ్తార్ చేసే వరకు (అల్లాహ్ తో) క్షమాభిక్ష కోరుతూ ఉంటారు.

2- బహిష్కృతులైన షైతానులు బంధించబడతారు.

3- ఇందులో ఒక ఘనతగల మహారాత్రి ఉంది. అది వెయ్యి నెలలకన్నా శ్రేష్ఠమైనది.

4- (నెలంతా) ఉపవాసమున్నవారు రమజాను చివరి రాత్రిలో క్షమించబడుతారు.

5- రమజానులోని ప్రతీ రాత్రి అల్లాహ్ అనేక నరకవాసులకు విముక్తి కలుగజేస్తాడు.

6- రమజానులో ఉమ్రా చేయుట హజ్ చేయడమతో సమానం.

ఇంకా ఈ గౌరవ మాసపు ఘనతలో అబూ హురైరః రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఈ శుభవార్త కూడా ఉంది: **ఏ వ్యక్తి సంపూర్ణ విశ్వాసం మరియు ప్రతిఫలాన్ని ఆశిస్తూ రమజానుపవాసాలు పాటిస్తాడో అతని పూర్వపు పాపాలు మన్నించబడతాయి.** (బుఖారి 38, ముస్లిం 760).

**ఆదము కుమారుడు చేసే ప్రతీ సత్కార్యానికి రెట్టింపు పుణ్యం ఉంటుంది, ఒక్క సత్కార్యానికి పది నుండి ఏడువందల వరకు రెట్టింపు పుణ్యం ప్రాప్తిస్తుంది. అల్లాహ్ చెప్పాడు: కాని ఉపవాసం, అది నా కొరకు కాబట్టి నేనే స్వయంగా దాని ఫలితమిస్తాను.** (ముస్లిం 1151).